సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 10 । జూలై । 2025



'కుబేర' వరకు..

పెద్దఅడిశర్లపల్లి మండలం మేడారం గ్రామానికి చెందిన అరవింద్ తెలుగు చిత్ర పరిశ్రమలో రాణిస్తున్నాడు. - 8లో



నేడు బుద్ధవనంలో..

నాగార్జున సాగర్‌లోని బుద్ధవనంలో గురువారం బుద్ధుడి ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. - 8లో



నిందితుల రిమాండ్

బంగారం దొంగిలించిన ఇద్దరు నిందితులను పెన్‌పహాడ్ మండల పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

భూ యజమానులకు నోటీసులు జారీ

బీబీనగర్: బీబీనగర్ మండల పరిధిలో రైల్వే డబ్లింగ్ పనుల కోసం భూ యజమానులకు రెవెన్యూ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. బీబీనగర్ మండల గూడూరు గ్రామం నుంచి ఏపీలోని గుంటూరు జిల్లా నల్లపాడు వరకు రైల్వే మార్గంలో జరుగనున్న నడికుడి డబ్లింగ్ పనులకు ఇటీవల భూ సేకరణ గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా గూడూరు, పగిడిపల్లి, భువనగిరి, నాగిరెడ్డిపల్లి, నందనం, అనాజిపురం, బొల్లేపల్లి గ్రామాల పరిధిలో రైల్వే ట్రాక్ వెంట గల భూ యజమానులకు రెవెన్యూ అధికారులు నోటీసులను జారీ చేయడంతో పాటు సర్వే ప్రక్రియను మొదలు పెట్టారు. దీంతో 800 ఎకరాలకుపైగా భూ సేకరణ జరుగనుంది.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

భువనగిరిటౌన్ : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం భువనగిరిలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధులపై వేధింపుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వయోవృద్ధుల కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, జేఏసీ నాయకులు మందడి ఉపేందర్ పాల్గొన్నారు.

ఆటాపాటలతో చదువు నేర్చుకోవాలి



పరికరాలు అందజేస్తున్న డీఈఓ

భువనగిరి : దివ్యాంగ విద్యార్థులు ఆటాపాటలతో చదువు నేర్చుకోవాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని భవిత కేంద్రంలో అలింకో సంస్థ సహకారంతో విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 66 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా బోధనాభ్యాసన పరికరాలను అందజేసి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విలీన విద్యా జిల్లా సమన్వయ కర్త పెసరు లింగారెడ్డి, విలీన విద్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణ వేడుక

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య కల్యాణ వేడుకను అర్చకులు నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రీస్వామి వారి ప్రధానాలయాన్ని వేకువజామునే తెరిచిన అర్చకులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేక పూజలు నిర్వహించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ చేపట్టి నిత్య కల్యాణం వేడుకను జరిపించారు. అనంతరం ముఖమండపంలో అష్టోత్తర పూజలు చేపట్టారు. రాత్రి శయనోత్సవం జరిపించి, ద్వార బంధనం చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కదంతొక్కిన కార్మికలోకం

సాక్షి, నెట్‌వర్క్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అన్ని కార్మిక సంఘాలు బుధవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన జాతీయ సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రమైన భువనగిరితోపాటు ఆలేరు, యాదగిరిగుట్ట, రామన్నపేట, పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్, మోత్కూరు ప్రధాన సెంటర్లతోపాటు మిగతా అన్ని మండల కేంద్రాల్లో కార్మిక సంఘాలు నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టాయి. చౌటుప్పల్‌లో ఆర్డీఓ, ట్రాన్స్‌కో డీఈ కార్యాలయాల ఎదుట ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాడ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయకుండా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



భువనగిరి పట్టణంలో చేపట్టిన ప్రదర్శనలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు, కార్మికులు



చౌటుప్పల్ ఆర్డీఓ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

అభాగ్యులను ఆదుకునేలా..

కుటుంబ పెద్ద చనిపోతే 'ఎన్‌ఎఫ్‌బీఎస్' కింద రూ.20 వేల ఆర్థికసాయం

- జాతీయ కుటుంబ ప్రయోజన పథకం పక్కాగా అమలుకు సెర్ప్ సీఈఓ ఆదేశం
- అర్జీలు స్వీకరిస్తూ ఆర్థికసాయం మంజూరు చేస్తున్న యంత్రాంగం
- నామినీ ఖాతాల్లో జమ అవుతున్న నిధులు
- జూన్‌లో 620 కుటుంబాలకు లబ్ధి



సాక్షి, యాదాద్రి : పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం-ఎన్‌ఎఫ్‌బీఎస్) అండగా నిలుస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల కుటుంబాలకు ఆర్థికసాయం చేసేందుకు సరిపడా నిధులుండడంతో ఐదేళ్లుగా మరుగున పడిన ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ గతనెలలో జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రైతులు, చేనేత కార్మికులు, వివిధ వృత్తుల వారి ఇంటి పెద్ద చనిపోయిన ఒక్కో కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం చేసేందుకు కలెక్టర్ ఆదేశాలతో అదనపు కలెక్టర్ నేతృత్వంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాలోని జిల్లాలోని 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీల్లో అర్హత కలిగిన వారినుంచి దరఖాస్తులు స్వీకరించి ఆర్థిక సహాయం మంజూరు చేయడంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉంది. మంజూరైన వారికి త్వరలో ప్రొసీడింగ్స్ అందజేయనున్నారు.

అర్హతలు ఇవే..

కుటుంబ యజమాని వయసు 18 నుంచి 60 ఏళ్ల వయసులోపు ఉండాలి. మరణ, వయసు ధ్రువీకరణ సర్టిఫికెట్లు, ఆధార్, తెల్ల రేషన్‌కార్డు జతచేయాలి. అలాగే ఆర్థిక సహాయం పొందగోరే వారి గుర్తింపు పత్రం, చిరునామా ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌తో అనుసంధానం అయిన బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా నంబర్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను జతపర్చాలి. మండలాల్లోనైతే తహసీల్దార్, పట్టణాల్లోనైతే మున్సిపల్ కమిషనర్లు దరఖాస్తులను విచారణ జరిపి అర్హత ఉంటే ఆర్డీఓ, కలెక్టర్ ద్వారా సెర్ప్ సీఈఓ కార్యాలయానికి పంపుతారు. అక్కడి పరిశీలన చేసిన అనంతరం లబ్ధిదారులను ఓకే చేసి చనిపోయిన కుటుంబ యజమాని నామినీ ఖాతాల్లో రూ.20వేలు జమ చేస్తారు.

జూన్‌లో ఆర్థికసాయం మంజూరు వివరాలు

మండలం	మంజూరైన లబ్ధిదారులు		
అడ్డగూడూరు	10	నారాయణపురం	29
ఆలేరు	36	పోచంపల్లి	17
భువనగిరి	21	రాజాపేట	59
ఆత్మకూర్(ఎం)	30	రామన్నపేట	30
బీబీనగర్	20	వలిగొండ	36
బొమ్మలరామారం	34	యాదగిరిగుట్ట	46
చౌటుప్పల్	10	**మున్సిపాలిటీల్లో మంజూరు**	
గుండాల	23	ఆలేరు	63
తుర్కపల్లి	14	భువనగిరి	02
మోటకొండూరు	68	చౌటుప్పల్	19
మోత్కూరు	29	మోత్కూరు	20
		పోచంపల్లి	02
		యాదగిరిగుట్ట	02

దరఖాస్తులు ఇలా..

జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జూన్ నెలలో 620 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరిలో బీసీలు 378, ఎస్సీలు 179, ఓసీలు 36, ఎస్టీలు 27 మంది ఉన్నారు. ఈనెలలో భాగంగా బుధవారం నాటికి మరో 225 మంది దరఖాస్తు చేసుకున్నారు. భువనగిరి, యాదగిరిగుట్ట, పోచంపల్లి మున్సిపాలిటీల నుంచి అతి తక్కువగా ఆలేరు, చౌటుప్పల్, మోత్కూరు నుంచి ఎక్కువ మొత్తంలో లబ్ధిదారులకు ఆర్థికసాయం మంజూరైంది. మండలాల్లో మోటకొండూరు, రాజాపేట, యాదగిరిగుట్ట, ఆలేరు, బొమ్మలరామారం మండలాల నుంచి అధికంగా మంజూరయ్యాయి. అయితే దరఖాస్తులకు చివరి తేదీ అంటూ గడువు లేకపోవడంతో అర్హులు తమ అర్జీలను అందజేస్తూనే ఉన్నారు.

అర్హులంతా అర్జీ పెట్టుకోండి



60 ఏళ్లలోపు వయసు ఉన్న కుటుంబ యజమాని చనిపోతే రూ.20 వేల ఆర్థిక సాయం కోసం ఎన్‌ఎఫ్‌బీఎస్‌కు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలి. జూన్ నెలలో 620 మందికి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పు వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయ్యాయి. బుధవారం నాటికి మరో 225 దరఖాస్తులు వచ్చాయి.

– వీరారెడ్డి, అదనపు కలెక్టర్

లింగ నిర్ధారణ, అబార్షన్లు చేస్తే కేసులు తప్పవు

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి : భువనగిరిలో అనుమతిలేని ఆస్పత్రులు నడవడంతోపాటు లింగనిర్ధారణ పరీక్షలు చేసే సెంటర్లపై విచారణ చేసి కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ పనితీరుపై బుధవారం ఆయన సమీక్షించారు. మూడు రోజుల క్రితం భువనగిరిలో లింగనిర్ధారణ పరీక్షలతోపాటు, ఇద్దరు గర్భిణులకు గర్భస్రావం చేసిన సంఘటపై సీరియస్ అయ్యారు. జిల్లా కేంద్రంలో రెండేళ్ల క్రితం అనుమతి రద్దు చేసిన ఆస్పత్రికి మరో పేరుతో అనుమతి ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భువనగిరి, రామన్నపేట, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, మాదాపూర్, వలిగొండ, ఆలేరు, మోత్కూరు ఇలా పలు చోట్ల ఆస్పత్రులు నిబంధనలకు విరుద్ధంగా నడస్తుంటే కఠిన చర్యలు ఎందుకు సిఫార్సు చేయడం లేదని వైద్యారోగ్యశాఖ అధికారిని కలెక్టర్ ప్రశ్నించారు. లింగనిర్ధారణ పరీక్షలు, అనుమతి లేకుండా ప్రైవేట్ ఆస్పత్రులు నడపడం, అర్హతలేని డాక్టర్లతో వైద్యం చేయడాన్ని అడ్డుకోవడంతోపాటు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని సమాచారం.



వలిగొండ : నాతాళ్లగూడెంలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలి

వలిగొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం వలిగొండ మండలం నాతాళ్లగూడెంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకొని ప్రభుత్వ ఆర్థికసాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ ఈ కిరణ్, ఏపీఎం జాని, ఏపీఓ పరుశరాములు, కార్యదర్శి తదతరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకోవాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి : నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలతోపాటు గర్భిణులకు అబార్షన్లు చేసిన ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులను అరెస్టు చేసి వెంటనే విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భువనగిరిలోని రైతు బజార్ ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్లు, అబార్షన్లు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న వారికిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీమున్సిపల్ చైర్మన్ అంజనేయులు, పార్టీ పట్టణకమిటి అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, రమేష్, సందెల సుధాకర్, కుశంగుల రాజు, ఇట్టబోయిన గోపాల్, భిక్షపతి, భగత్, చౌదరి, పాండు, ముజీబ్, పద్మ, పావని, మధు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బస్సులు నడపాలని రాస్తారోకో



రాజాపేటలోని గాంధీ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

రాజాపేట : సకాలంలో బస్సులు నడపాలని కోరుతూ రాజాపేటలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం స్థానిక గాంధీ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కొండ్రెడ్డిచెరువు, పుట్టగూడెం గ్రామాలకు చెందిన సుమారు 60 మందికిపైగా విద్యార్థులం రాజాపేటలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్నామని తెలిపారు. తాము మా గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చేందుకు ఉదయం 7గంటలకు ఒకసారి, సాయంత్రం 5గంటలకు యాదగిరిగుట్ట డిపోకు చెందిన బస్సు ఉందని, అది ఉదయం వేళలో సమయానికి బస్సు నడుస్తున్నా సాయంత్రం మాత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు కూడా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నామని వాపోయారు. స్థానిక నాయకులు చొరవ చూపి యాదగిరిగుట్ట డిపో అధికారులతో మాట్లాడి విద్యార్థులకు సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



పోచంపల్లిలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కుంభం, చిత్రంలో అదనపు కలెక్టర్



యాదగిరిగుట్ట : మొక్కకు నీరు పోస్తున్న ఆలయ ఉద్యోగులు, అర్చకుడు

భూదాన్‌పోచంపల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి రాంనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎఫ్‌ఓ పద్మజారాణి, పబ్లిక్‌హెల్త్ డీఈ మనోహర, ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ ప్రభాకర్, రాజారెడ్డి, మేనేజర్ నిర్మల, రాజేశ్, నాయకులు తడక వెంకటేశం, పాక మల్లేశ్, భారత లవకుమార్, కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూధన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రమేశ్, సందీప్, వెంకటేశ్, వాసుదేవ్, బాలకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వాడలో వన మహోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండకు దిగువన ఉన్న ఆధ్యాత్మిక వాడలో బుధవారం ఆలయ ఉద్యోగులు, మినిస్ట్రీరియల్, మతపర, నాలుగోవ తరగతి సిబ్బంది, నాయీ బ్రాహ్మణులు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, పరిసరాలు, సంస్కృత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ, ఆలయ ఉద్యోగులు గజివెల్లి రమేష్‌బాబు, నవీన్‌కుమార్, రఘు, శ్రావణ్ కుమార్, ఉపాధ్యాయులు, అర్చకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత

తుర్కపల్లి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత అన్నారు. తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చట్ట పరిరక్షణ మద్దతు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నాగరాజు, పారా లీగల్ వలంటీర్లు హీరాలాల్, మౌనిక, సబ్ ఇన్‌స్పెక్టర్ తక్యుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవీలత

రెండేళ్లుగా పైసా ఖర్చు చేయలే!

ఖజానాలో మూలుగుతున్న రూ.15 కోట్లు

- టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరు
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం
- వార్డుల్లో పడకేసిన అభివృద్ధి పనులు
- ఇబ్బందుల్లో పట్టణ వాసులు

ఆలేరు: తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) నుంచి మంజూరైన కోట్ల రూపాయల నిధులు రెండేళ్లుగా ఆలేరు మున్సిపల్ ఖజానాలో మూలుగుతున్నా అభివృద్ధి పనులకు పైసా ఖర్చు చేయడం లేదు. దీంతో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఈ ఏడాది జనవరిలో మున్సిపల్ పాలకమండలి పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. అధికారుల ఉదాసీన వైఖరితో ఆలేరు మున్సిపాలిటీలో అభివృద్ధి పడకేసింది. అధికారులు కేవలం సంక్షేమ పథకాలపైనే దృష్టిసారిస్తూ అభివృద్ధి పనులను పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓపెన్ నాలాలతో పరేషాన్

మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 12 వార్డులు ఉండగా, 22వేల జనాభా ఉంది. ఆయా వార్డుల్లో ఓపెన్ నాలాల పరిస్థితి మెరుగుపడడం లేదు. అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు మోక్షం లభించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వానాకాలంలో ఓపెన్ నాలాలతో మురుగునీటి సమస్య వల్ల దోమలు, పందులతో ప్రజారోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



డ్రెయినేజీ నిర్మాణం లేక ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పక్కన పారుతున్న మురుగునీరు

పలు ప్రాంతాల్లో సమస్యలు ఇలా..

వరదనీటి ప్రవాహం సులువుగా వెళ్లేందుకు పాత పంచాయతీ కార్యాలయ సమీపం నుంచి ప్రధాన రోడ్డులోని మసీదు వరకు స్లాబ్ నిర్మించాల్సి ఉంది. మున్సిపల్ ఆఫీస్‌కు కూతవేటు దూరంలో, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ పక్కన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి. ఇక్కడ మురుగునీరు ఏరులై పారుతూనే ఉంది. క్రాంతి నగర్, రైల్వేస్టేషన్ మార్గంలో డబుల్ బెడ్ ఇళ్ల వద్ద తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వలు నిర్మించాలని చాలాకాలం నుంచి స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇక సీసీ రోడ్లు కూడా కావాలని పలు వార్డుల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల బీసీ కాలనీ వాసులు కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేసిన అభివృద్ధి పనులను చేపట్టడం లేదని స్థానికులు అంటున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

పోచమ్మ గుడి సమీపంలోని శాంతినగర్‌లో అంతర్గత రోడ్డు అధ్వానంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. దాదాపు పదేళ్లుగా ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒక్క శాంతినగర్‌లోనే కాదు పలు వార్డుల్లోని అంతర్గత రోడ్ల పరిస్థితి ఇలాగే ఉందనే విమర్శలు ఉన్నాయి.

రూ.15 కోట్లతో పనులు ఇలా..

టీయూఎఫ్ఐడీసీ కింద దాదాపు రెండేళ్ల క్రితం ఆలేరు మున్సిపాలిటీకి రూ.15కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో రూ.9కోట్లతో వివిధ వార్డులు, ప్రధాన మార్గాల్లో స్లాబ్‌ల నిర్మాణం చేపట్టాలి. వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కొత్త మున్సిపల్ భవనం నిర్మాణానికి రూ.3కోట్లను కేటాయించారు. మిగితా రూ.3కోట్లతో ఇతర మౌలిక సదుపాయాలకు వెచ్చించాల్సి ఉంది. కానీ ఇంత వరకు పనుల అతీగతి లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరగా అభివృద్ధి పనులు చేపట్టాలి



నిధులు ఉన్నందున అవసరమైన వార్డుల్లో డ్రెయినేజీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలి. ఇందుకు మున్సిపల్ కమిషనర్ వెంటనే చొరవ చూపాలి.

– సముద్రాల శ్రీనివాస్, బీజేపీ నేత, ఆలేరు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



వార్డుల్లో అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే రూ.15కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టే పనులకు త్వరలోనే టెండర్లను ఆహ్వానిస్తాం.

– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఆలేరు

క్లుప్తంగా

గూడ్స్‌రైలు కింద పడి మహిళ దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్: గైడ్స్ రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున మిర్యాలగూడ రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. రైల్వే ఎస్‌ఐ బి. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45ఏళ్ల వయస్సున్న మహిళ మిర్యాలగూడ రైల్వే స్టేషన్ యార్డ్‌లో రైలు పట్టాలు దాటుతుండగా ప్లాట్‌ఫాం–2 వద్ద గూడ్స్ రైలు కింద పడి మృతిచెందింది. మృతురాలు నీలం రంగు జాకెట్, నారింజ రంగు చీర ధరించి ఉందని, 5.4 అంగుళాల ఎత్తు ఉంటుందని రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో..


ఉమ (ఫైల్)

బీబీనగర్: కూలీ పనికి వెళ్లిన మహిళకు పాము కాటుతో మృతి చెందింది. ఈ ఘటన బీబీనగర్ మండలం రహీమ్‌ఖాన్‌గూడెం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం రాయరావుపేట గ్రామానికి చెందిన గంగదారి ఉమ(50) భర్త గతంలోనే మృతిచెందడంతో ఆమె తన పుట్టిల్లు అయిన రహీమ్‌ఖాన్‌గూడెం గ్రామంలో తల్లిదండ్రుల వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. ఉమ రోజుమాదరిగా బుధవారం కూలీ పనికి వెళ్లగా.. పని ప్రదేశంలో పాము కాటు వేయడంతో స్పృహ కోల్పోయి మృతిచెందింది.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

రామన్నపేట: ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రామన్నపేట మండల కేంద్రం శివారులో జరిగింది. వివరాలు.. గుర్రంపోడు మండలానికి చెందిన వేముల సంజీవ(35) కంప్రెషర్ ట్రాక్టర్‌పై రామన్నపేట మండలం వెల్లంకి గ్రామం వైపు వెళ్తుండగా.. రామన్నపేట మండల కేంద్రం శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడింది. ఈ ఘటనలో సంజీవకు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ట్రాక్టర్ యజమాని ఘటనా స్థలానికి చేరుకుని సంజీవను నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు..


జానయ్య (ఫైల్)

కేతేపల్లి: తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకటిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఆల్దాసు జానయ్య(40) బుధవారం సాయంత్రం గ్రామంలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. ప్రమాదవశాత్తు కాలు జారి కిందిపడ్డాడు. అతడి నడుముకు ఉన్న ముస్తాదు, మోకు మెడ చుట్టూ బిగుసుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతుడు జానయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

మోతె: బైక్‌పై వెళ్తూ డివైడర్ ఢీకొని యువకుడు మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై మోతె మండల కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బుర్రి వర్ధన్ బాబు(22) తన స్నేహితుడు కంచర్ల తరుణ్‌తో కలిసి బుధవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో 365వ నంబర్ జాతీయ రహదారిపై మోతె మండల కేంద్రం సమీపంలో రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపుతప్పి బైక్‌తో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో వర్ధన్‌బాబు మృతిచెందాడు. మృతుడి తండ్రి ప్రభాకర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

పెద్దఅడిశర్లపల్లి నుంచి కుబేర వరకు..

- తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో సత్తాచాటుతున్న మేదారం కుర్రాడు
- కుబేర సినిమాకు చీఫ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన అరవింద్

పెద్దఅడిశర్లపల్లి: ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టి ట్రావెలింగ్, ఫొటోగ్రఫీపై తనకున్న ఆసక్తితో అంచలంచెలుగా ఎదుగుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో రాణిస్తున్నాడు నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మేడారం గ్రామానికి చెందిన మేడారం వెంకటయ్య, అంజమ్మ దంపతుల కుమారుడు మేడారం అరవింద్. ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన కుబేర సినిమాకు అరవింద్ చీఫ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు.


షూటింగ్‌లో హీరోయిన్ రష్మిక మందానతో అరవింద్

అరవింద్ తల్లిదండ్రులు అతడి చిన్నతనంలో బతుకుదెరువు కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లగా.. వారితో పాటు అతడు కూడా వెళ్తూ సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నారు. ఓ వైపు చదువుకుంటూనే మరో వైపు పేపర్‌బాయ్‌గా, క్యాటరింగ్ బాయ్‌గా, రైస్‌మిల్లు నైట్ షిఫ్ట్ చేస్తూ సొంత ఖర్చులు సమకూర్చుకున్నారు. అంతేకాకుండా తనకు సాహిత్యంపై ఉన్న మక్కువతో కవితలు, వ్యాసాలు రాస్తుండేవాడు. ట్రావెలింగ్, ఫొటోగ్రఫీ అభిరుచి ఏర్పర్చుకొని సినిమాల్లో ప్రవేశం దొరకబుచ్చుకున్నారు.



చదువుకునే రోజుల్లోనే సాహిత్యంపై ఆసక్తి..

తెలుగు యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీల్లో అరవింద్ చదువు కొనసాగింది. తమ గ్రామం నుంచి యూనివర్సిటీకి వచ్చిన మొదటితరం విద్యార్థి అరవిందే కావడం విశేషం. మాస్ కమ్యూనికేషన్ చదువుతూనే వార, మాస పత్రికలు నడిపారు. చిన్నతనంలో పేపర్‌బాయ్‌గా పనిచేయడం వల్ల సాహిత్య పఠనం అలవడింది. అనేక సామాజిక, సాహిత్య అంశాలను స్పృశిస్తూ కవితలు, వ్యాసాలు రాశారు.

సాహిత్య ప్రచారం..

కథ, కవిత్వం, నవలలు విరివిగా చదవటం.. చదివిన పుస్తకాలను నలుగురికీ పంచడం అవసరమని భావించిన అరవింద్ 'ఆలోచనా' అనే సంస్థ ద్వారా గ్రామీణ, పట్టణ విద్యార్థులకు చిట్టిపొట్టి జానపద కథల నుంచి దేశభక్తుల జీవితచరిత్ర వరకు పరిచయం చేయడం, చదివించడం చేశారు. హైదరాబాద్ నగరంలోని యూనివర్సిటీల్లో స్టడీ సర్కిల్స్ నిర్వహణ, పుస్తకాలు, సినిమాలు, ఆర్ట్స్ పై సదస్సులు, సభలు నిర్వహించేవారు. దక్షిణ భారతదేశం మొత్తం యాత్రలు చేయడంతో ఫొటోగ్రఫీపై అభిరుచి ఏర్పడింది. ఆయా ప్రాంతాల సంస్కృతి, వైవిధ్యం, ఆర్కిటెక్చర్‌ను కెమెరాల్లో బంధించి వాటిని యూనివర్సిటీల్లో, పట్టణాల్లో ప్రదర్శించారు.


దర్శకుడు శేఖర్ కమ్ములతో అరవింద్

జాతిరత్నాలు డైరెక్టర్‌తో సినిమా రంగంలోకి...

జాతిరత్నాలు సినిమా డైరెక్టర్ అనుదీప్ కేవీతో అరవింద్‌కు ఏర్పడిన పరిచయం స్నేహం మారడంతో ఆయనకు సినిమాల్లోకి ప్రవేశం దొరికింది. ఆయన కథలను చర్చిస్తుండటం.. రాస్తుండటంతో అనుదీప్ కేవీ దర్శకత్వం వహించిన ప్రిన్స్ సినిమాకు రచన విభాగంలో పనిచేయడం వలన రచన నైపుణ్యాన్ని అరవింద్ నేర్చుకున్నారు.

కుబేర విజయాన్ని ఆస్వాదిస్తున్నా

"కుబేర సినిమా మొదలవుతుంది అనుకున్న రెండు నెలల ముందు శేఖర్ కమ్ముల గారు నన్ను పిలిచారు. మొదట ఇంటర్న్‌షిప్‌గా జాయిన్ అయ్యాను. నాకు ట్రావెలింగ్ చేసిన అనుభవం ఉండడంతో ఈ సినిమా కథకు ముంబై దగ్గర్లలో లొకేషన్స్ వెతికి పెట్టే పని అప్పగించారు. ఈ క్రమంలో ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌కి ఇన్‌చార్జిగా నియమించారు. తోట తరణి వంటి ఆర్ట్ డైరెక్టర్‌తో శేఖర్ కమ్ముల నేతృత్వంలో పనిచేయడం జీవితంలో మరిచిపోలేని మైలురాయి. డైరెక్టర్ విజన్, ప్రొడక్షన్ డిజైనర్ విజువల్ సెట్‌లో ప్రతిబింబించడానికి నిద్రాహారాలు పక్కనపెట్టి పనిచేశా. అయినా కష్టం అనిపించలేదు. ఆర్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రాణితో సమన్వయంలో ఉండటం వలన టీంతో రాత్రి, పగలు ఆడుతూ పాడుతూ షూటింగ్ కంప్లీట్ చేశాం. కుబేర సినిమా విజయాన్ని నేను, మా టీం సభ్యులు ఆస్వాదిస్తున్నాం."

– మేడారం అరవింద్, చీఫ్ అసోసియేట్ డైరెక్టర్

బంగారం దొంగిలించిన నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పెన్‌పహాడ్: బంగారం దొంగిలించిన ఇద్దరు నిందితులను పెన్‌పహాడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను బుధవారం సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం అనంతారం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం ఎస్‌ఐ గోపికృష్ణ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ కారును ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 4.7తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు ఉన్నట్లు గుర్తించారు. కారులో ఇద్దరు వ్యక్తులు ఉండగా.. వారిలో ఒకరు పాత నేరస్తుడు ఖమ్మంపాటి నాగేశ్వర్ రావు కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. గత నెల 20న పెన్‌పహాడ్ గ్రామంలో గుండవనేని వెంకట్రావు ఇంట్లో 4.7 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించారు. అదేవిధంగా ఈ నెల 5న నాగేశ్వర్‌రావు, మరో నిందితుడు మామిడి జనార్దన్ కలిసి దూపహాడ్ గ్రామానికి చెందిన పత్తిపాక సైదులు ఇంట్లో రూ.2వేలు నగదు దొంగిలించారని డీఎస్పీ తెలిపారు. దొంగతనం చేసిన బంగారం విక్రయించేందుకు వెళ్తుండగా.. నిందితులను పట్టుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ గోపికృష్ణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'సెటిల్‌మెంట్'పై పోలీసుల విచారణ

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పు కోసం వచ్చి గర్భిణి మృతిచెందిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన మహిళకు ఇద్దరు కుమార్తెలు ఉండగా.. మూడో కాన్పు కోసం చౌటుప్పల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. సోమవారం ఆమెకు కుమారుడు పుట్టాడు. ప్రసవ సమయంలో వైద్యురాలి నిర్లక్ష్యంతో అంతర్గతంగా రక్తస్రావం జరగడంతో గర్భిణి పరిస్థితి విషమించింది. దీంతో ఆమెను హైదరాబాద్‌కు తరలించగా.. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. ఆస్పత్రి నిర్వాహకులు మాత్రం ఆమెకు హార్ట్ బీట్ సరిగా లేకపోవడంతోనే హైదరాబాద్‌కు తరలించామని చెబుతున్నారు. ఈ ఘటన గురించి బయటకు తెలియకుండా ఆస్పత్రి నిర్వాహకుల తరఫున అధికార పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధిని మధ్యవర్తిత్వం చేసేందుకు రంగంలోకి దింపారు.

పోస్టుమార్టం చేస్తే వాస్తవాలు బయటకొస్తాయనే..

మృతిచెందిన మహిళ మృతదేహాన్ని చౌటుప్పల్‌కు తీసుకొస్తే పోస్టుమార్టం చేయాల్సి వస్తుందని గ్రహించిన అధికార పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి.. ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.12లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. రూ.2లక్షలు నగదు రూపంలో చెల్లించి, మిగతా రూ.10లక్షలకు ఆ మాజీ ప్రజాప్రతినిధి ఏకంగా తన సొంత చెక్కులనే అందజేసినట్లు సమాచారం. అంతేకాకుండా పోలీసులతో మాట్లాడి చౌటుప్పల్‌లో ఆస్పత్రి వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. అనంతరం గుట్టుగా మహిళ మృతదేహాన్ని వెల్లంకి గ్రామానికి తరలించి దహన సంస్కారాలు పూర్తి చేయించినట్లు సమాచారం.

లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు ఆరోపణలు

ఇదిలా ఉండగా చౌటుప్పల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు పెద్దఎత్తున జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై పోలీస్ శాఖ విచారణ చేపట్టింది. అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సైతం నివేదిక తెప్పించుకునే పనిలో ఉన్నారు. ఈ ఘటనపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్‌ను సంప్రదించగా.. మహిళ మృతికి కారణాలు తెలుసుకొని నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు

కొండమల్లేపల్లి: దేవరకొండ పట్టణంలోని గణేష్‌నగర్‌లో వ్యభిచార గృహాలపై పోలీసులు బుధవారం దాడులు చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. అందులో ఇద్దరు మహిళలు, 8మంది పురుషులు ఉన్నట్లు సీఐ నరసింహులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మిర్యాలగూడ అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 70150, 87125 77233 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

ఆలయంలో చోరీ

చిలుకూరు: చిలుకూరులోని అంతరగంగ వాగు వద్ద నూతనంగా నిర్మించిన కంఠ మహేశ్వరస్వామి స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గడ్డపారతో ఆలయం తాళం పగులగొట్టి హుండీలోని నగదును దొంగిలించి హుండీని బయట పడేశారు. బుధవారం ఉదయం దేవాలయం బయట హుండీ ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులు పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాలు సేకరించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

- నలుగురి అరెస్ట్

నేరేడుచర్ల: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామ శివారులో బుధవారం జరిగింది. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కందులవారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. మరొకరు పరారయ్యారు. వారి నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని ఆర్‌ఎంపీలపై కేసు నమోదు

కొండమల్లేపల్లి: దేవరకొండ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న పలువురు ఆర్‌ఎంపీలపై పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు రాము ఫిర్యాదు మేరకు దేవరకొండ పట్టణంలోని సాయిరాం క్లినిక్ నిర్వాహకుడు రాజేశ్వరరావు, అల్ఫా క్లినిక్ నిర్వాహకుడు జహంగీర్, ఆకాశ్ కంటి ఆస్పత్రి నిర్వాహకుడు రమేష్, మారుతీ క్లినిక్ నిర్వాహకుడు సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య


యాదయ్య (ఫైల్)

కనగల్: నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రానికి చెందిన గోనెల చిన్న యాదయ్య (45) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. యాదయ్య తనకున్న కొద్దిపాటి భూమితోపాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని సేద్యం చేయటంతో పాటు కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సాగులో నష్టాలు రావటం కుటుంబ ఖర్చులు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. భార్య కాశమ్మతో తరచూ గొడవలు రావడంతో వారం రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన చిన్న యాదయ్య బుధవారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన యాదయ్య తల్లి లింగమ్మకు కొడుకు ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తల్లి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామయ్య తెలిపారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

- శ్రీశైలంలో ఒక గేటు మూసి.. మూడు గేట్ల ద్వారా నీటి విడుదల
- సాగర్ జలాశయానికి చేరుతున్న 1,17,868 క్యూసెక్కుల నీరు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయానికి కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. శ్రీశైలం జలాశయం మూడు గేట్లు ఎత్తి స్పిల్‌వే మీదుగా దిగువకు 80,646 క్యూసెక్కులు, కుడి ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 47,293 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి మొత్తంగా 1,17,868 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు). ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 536.90 అడుగుల (181.9292టీఎంసీలు)కు చేరింది. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు నాలుగు ఎత్తగా.. అధికారులు బుధవారం ఒక గేటు మూసివేసి మూడు క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన కృష్ణానది పరీవాహక ప్రాంతాలలోని జలాశయాలు జలకలను సంతరించుకొని ఉన్నాయి. ఆలమట్టి నుంచి దిగువన గల జూరాల వరకు తుంగభద్ర జలాశయం నుంచి కూడా వరద కొనసాగుతూనే ఉంది. కొంత ఆలస్యంగానైనా సాగర్ జలాశయం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని సాగునీటి శాఖ అధికారులు తెలిపారు.

సాగునీటి విడుదల ఎప్పుడో..

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో వరినారు పోసుకునేందుకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. సాగర్ జలాశయంలో 540 అడుగుల మేరకు నీరున్నప్పుడు.. ఎగువ నుంచి వరద కొనసాగుతున్న సమయంలో గతంలో ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, కాల్వలకు సాగునీటి విడుదలపై 14వ తేదీన సమీక్ష చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఏయే జలాశయంలో ఎంత నీరుంది? నీటి విడుదలకు ముహూర్తం ఖరారు చేయడంతో పాటు షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు తెలిసింది.

నేడు బుద్ధవనంలో ధర్మచక్ర పరివర్తన దినోత్సవం


నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం

నాగార్జునసాగర్: సిద్దార్థుడికి జ్ఞానోదయం అయ్యి గౌతమ బుద్ధుడిగా మారిన తర్వాత మొదటి బోధన చేసిన రోజును స్మరించుకుంటూ గురువారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. గౌతమ బుద్ధుని జీవితంలో ముఖ్యమైన ఐదు ఘట్టాలలో ఒకటి మొదటి ఉపన్యాసం. దీనిని ధర్మచక్ర పరివర్తన అనిపిలుస్తారు. బౌద్ధులు, బౌద్ధ అభిమానులు ఈ రోజును ప్రత్యేక దినంగా పరిగణిస్తూ వేడుకలు జరుపుకుంటారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా బుద్ధవనంలో ధర్మచక్ర పరివర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బుద్ధవనం ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించిన మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఉద్యోగులు తెలిపారు. ఉదయం 11గంటలకు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి బౌద్ధ సంఘం ప్రతినిధులు, ఇతర ప్రాంతాల నుంచి బౌద్ధ భిక్షువులు తరలిరానున్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి
- మరో బాలుడికి గాయాలు

మోత్కూరు: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. మరో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు.. గుండాల మండలం వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి శంకర్(48) టీవీఎస్ ఎక్సెల్‌పై మోత్కూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. గుండాల మండలం నుంచి బైక్‌పై వస్తున్న బాలుడు అతివేగంగా ఎదురుగా వచ్చి మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి ఎక్స్ రోడ్డు వద్ద శంకర్ టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శంకర్ తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో మోత్కూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనలో గాయపడిన బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జనగామకు తరలించారు. పోలీసులు శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేపు ఎంజీయూలో స్క్రాప్ వేలం

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీలో నిర్మాణాల సందర్భంగా పోగుపడిన పాత ఇనుము, చెక్క ఇతర స్క్రాప్‌ను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ అల్వాల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9948361250 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బైక్‌కు నిప్పంటించిన దుండగులు

అడవిదేవులపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పంటించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి అడవిదేవులపల్లి మండల కేంద్రంలో జరిగింది. వివరాలు.. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన ఉద్దండి కోటయ్య తన బైక్‌ను మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. బుధవారం ఉదయం లేచి చూడగా బైక్ కనిపించలేదు. గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లో బైక్ దగ్ధమవుతుండటం గమనించిన గ్రామస్తులు కోటయ్యకు సమాచారం ఇచ్చారు. కోటయ్య వెళ్లి చూడగా.. బైక్‌పై గడ్డి వేసి నిప్పంటించినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.


పొలాల్లో దగ్ధమైన బైక్

పంటల సాగులో ఎరువుల వాడకం కీలకం


పెద్దవూరలో పత్తి చేనులో ఎరువులు వేస్తున్న రైతులు

పెద్దవూర: పంటల సాగులో ఎరువుల వాడకం కీలకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ పేర్కొన్నారు. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే దానిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎరువుల వినియోగానికి సంబంధించి రైతులు పాటించాల్సిన పద్ధతులను ఆయన వివరించారు.

రసాయనిక ఎరువులతో నష్టం

రసాయనిక ఎరువుల వాడకం శ్రేయస్కరం కాదు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారంలో మార్పులు సంభవిస్తాయి. మరోవైపు పంట ఉత్పత్తుల్లో రసాయనిక అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డిమాండ్ తగ్గి ధరలు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. విరివిగా, విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వాడటం తగ్గించాలి.

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువుతో అన్ని రకాల పంటలకు పోషకాలు అందుతాయి. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.

ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులు

- లోతు దుక్కుల వల్ల భూమి పొరలు గుల్లబారి తేమను బాగా నిల్వ ఉంచుకుంటాయి. నేలలో వేసిన ఎరువును ఎక్కువ శాతం మొక్కలు తీసుకుంటాయి.
- పంటలో ఉన్న కలుపును పూర్తిగా తొలగించిన అనంతరం తేమ ఉన్న దశలోనే ఎరువులు చల్లుకోవాలి.
- సమస్యాత్మక భూముల్లో ముందుగా ఉన్న సమస్యను సరిచేసుకుని ఆ తర్వాత ఎరువులు వేసుకుంటే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

పాడిపంట

- అన్ని పోషకాల్లో నత్రజని పోషకం వృథా ఎక్కువగా ఉంటుంది. యూరియాను వేప పిండితో కలిపిగానీ, యూరియా ఎరువుతో వేప నూనె కలుపుకుని గానీ వాడితే నత్రజని నెమ్మదిగా విడుదలవుతూ వృథా తగ్గుతుంది.
- కోల్‌థార్‌తో 2 లీటర్ల కిరోసిన్‌తో మిశ్రమం చేసి రెండు బస్తాల యూరియాలో కలిపితే మంచి ఫలితాలు వస్తాయి. అదేవిధంగా అర బస్తా యూరియాను ఒక బస్తా తడి, పొడి మట్టితో కలిపి 24గంటలు నీడలో ఉంచి ఆ తర్వాత నేలకు అందిస్తే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

ఎరువుల ధరలపై అవగాహన అవసరం

ఎరువుల వాడకం ఎంత ముఖ్యమో.. వాటి ధరలపై అవగాహన కలిగి ఉండటం కూడా అంతే ముఖ్యం. ఏయే ఎరువుల్లో ఏ శాతం ఎంత ఉంటుంది. నాణ్యత, ధరలు, నకిలీలు వంటి వాటిని గమనించాలి. దీనికి వ్యవసాయ అధికారులు, అవగాహన ఉన్న రైతుల సలహాలు తీసుకోవాలి.

వెదజల్లే పద్ధతి.. ప్రయోజనాలు

సాధారణంగా ఎరువులను రెండు పద్ధతుల్లో వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో మొక్కలు దగ్గర దగ్గరగా ఉంటే మేలు జరుగుతుంది. వరుస క్రమంలో లేని మొక్కలకు, వేళ్లు భూమిలో అల్లుకుపోయే పైర్లకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. వరికి కూడా ఈ పద్ధతి మేలు చేస్తుంది.

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరువులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.

ఏ దశలో, ఏ సమయంలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి. భాస్వరం ఎరువును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచటంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.